నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 11 జూలై 2024 | SANGAREDDY



చిట్కుల్ గ్రామంలో తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంక్, సంపు

# తాగునీరు మహాప్రభో..!

- కాలుష్య పీడిత గ్రామాలకు సురక్షిత నీరు కరువు
- 20 గ్రామాలకు రోజు నీరివ్వాలనే గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు
- కాలనీలకు వారానికి ఒకరోజు నీటి సరఫరా
- మిషన్ భగీరథ నీటిలో బోరువాటర్ మిక్స్
- పెరుగుతున్న జనాభా అవసరాలు తీరే దారేదీ..
- తూతూమంత్రంగా చేపట్టిన మిషన్ భగీరథ సర్వేతో నష్టం

పటాన్‌చెరు, జూలై 10 : కాలుష్యంతో కొట్టుమిట్టాడుతున్న పటాన్‌చెరు ప్రాంతానికి శుద్ధమైన తాగునీటికి తిప్పలు తప్పేలా లేవు. ఇంటింటికీ శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన మిషన్ భగీరథ సర్వేను పంచాయతీ కార్యదర్శులు తూతూమంత్రంగా చేపట్టారు. కొత్తగా వెలిసిన కాలనీలు, పెరిగిన జనాభా వివరాలను సర్వేలో పొందుపర్చలేదు. దీంతో సరిపడా మిషన్ భగీరథ నీటి కేటాయింపులు జరగక ఈ ప్రాంత ప్రజలకు నష్టం జరిగే అవకాశం ఉంది. పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల్లో ఐదేండ్లలో పదుల సంఖ్యలో కొత్తగా కాలనీలు వెలిశాయి.రికార్డుల్లో నమోదైన ఇండ్లలో మాత్రమే సిబ్బంది సర్వే చేపట్టారని సమాచారం.కొత్త కాలనీల్లో, రికార్డుల్లో లేని ఇండ్లలో సర్వే చేపట్టలేదనే ఆరోపలు ఉన్నాయి. పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల్లో పెరుగుతున్న జనాభాకు సరిపోను తాగునీరు రావడం లేదు. ఇప్పుడు ఈ సర్వే ద్వారా సరిపడా తాగునీరు అందుతుందా..? అంటే అది ప్రశ్నార్థకంగానే మారింది.



ఇస్నాపూర్ సంప్‌లో భగీరథ నీటిలో కలుషిత నీటిని కలుపడం పరిశీలిస్తున్న జిల్లా యంత్రాంగం (ఫైల్)

### గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖతార్..

పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో 25 వేల జనాభా ఉంది. పంచాయతీ సర్వే సిబ్బంది 3573 ఇండ్లలో సర్వే నిర్వహించారు. పెండింగ్ ఇండ్లు లేవని తెలిపారు. పరిశీలిస్తే ఈ గ్రామంలో పది కాలనీల కొత్తగా వెలిశాయి. ఆ కాలనీల్లో సర్వే చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా సర్వే చేయాల్సిన ఇండ్లు అధికంగా ఉన్నాయని కాలనీవాసులు, నాయకులు చెబుతున్నారు. చిట్కుల్ గ్రామానికి ఇప్పుడు రోజుకు 9.50 లక్షల లీటర్ల తాగునీరు ఇస్తున్నామని మిషన్ భగీరథ గ్రిడ్ లెక్కలు చెబుతున్నాయి. ఈ సర్వే లెక్కల ప్రకారం 15వేల జనాభకు సరిపోనుగా 15లక్షల లీటర్ల నీరు కేటాయింపు జరిగే అవకాశం ఉంది. దాదాపు మరో పదివేల మందికి తాగునీరు లభించకపోవచ్చు. పారిశ్రామికవాడలో 1996 నుంచి పర్యావరణవేత్తలు న్యాయ పోరాటం ప్రారంభించారు. గ్రీన్ ట్రిబ్యునల్ కాలుష్య పీడిత గ్రామాల లిస్టులో, భూగర్భ జలాలు పాడైన గ్రామాల్లో చిట్కుల్ ఉంది. రిట్ పిటిషన్ నెంబర్ 3158/1996 ఏపీ హైకోర్టు, అప్లికేషన్ నెంబర్ 69, 2013ను పరిగణలోకి తీసుకుని సుధీర్ఘకాలం విచారించిన చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ ఉచితంగా తాగునీరు అందరికీ ఇవ్వాలని ఆదేశించింది. ఈ మధ్యలో 2017 నుంచి మిషన్ భగీరథ ద్వారా అన్ని ఇండ్లకు తాగునీరు పథకం ప్రారంభించారు. గత ఐదేండ్లలో చిట్కుల్ గ్రామం శరవేగంగా అభివృద్ధి చెందింది. కొత్త కాలనీలు వెలిశాయి. ఆ కాలనీల్లోను సర్వే నిర్వహిస్తే మరో పది వేల మందికి ఉచితంగా తాగునీరు లభిస్తుంది. నల్లగొండ జిల్లాకు ఫ్లోరైడ్ ఎలా శాపమో.? పటాన్‌చెరు ఇండస్ట్రియల్ ఏరియాకు భూగర్భ జల కాలుష్యం శాపం. కాలుష్యంతో వారం క్రితం చిట్కుల్ గ్రామ పెద్ద చెరువులో 10 టన్నుల చేపలు మృతిచెందాయి. పంచాయతీ సిబ్బంది చేస్తున్న తూతూమంత్రపు సర్వేలతో ఈ గ్రామానికి తక్కువ కనెక్షన్లు, నీరు లభించి నష్టం జరిగే అవకాశం ఉంది.

### గ్రీన్ ట్రిబ్యునల్ గుర్తించిన కాలుష్య గ్రామాలివే..

పటాన్‌చెరు, సంగారెడ్డి మండలాల నుంచి 20 గ్రామాలు బ్యాతోల్, ఆరుట్ల, చిద్రుప్ప, ఇస్మాయిల్‌ఖాన్‌పేట్, గండిగూడెం, సుల్తాన్‌పూర్, ఖాజీపల్లి, కిష్టారెడ్డిపేట్, ఐనోల్, పెద్దకంజర్ల, పటాన్‌చెరు, లక్డారం, ముత్తంగి, 14 ఇస్నాపూర్, కంది, రుద్రారం, రామచంద్రాపురం,కలబ్‌గూర్, చిట్కుల్, పోచారాన్ని గ్రీన్ ట్రిబ్యునల్ కలుషిత గ్రామాలుగా గుర్తించి ఈ ప్రాంతంలో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఉచితంగా తాగునీరు అందజేయాలనే ఆదేశించింది. నల్లాలు రాని రోజు ట్యాంకర్లతోను నీటి సరఫరా చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాల సరిగ్గా అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు తూతూమంత్రంగా చేపట్టిన మిషన్ భగీరథ సర్వేతో తాగునీటికి మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.



ఇటీవల చిట్కుల్ పెద్ద చెరువులో కలుషిత జలాలతో భారీగా చనిపోయిన చేపలు (ఫైల్)

### వారంలో ఒకరోజే..



చిట్కుల్ గ్రామంలో ప్రత్యేకాధికారుల పాలన వచ్చిన తర్వాత వారంలో ఒకరోజు కూడా సరిగ్గా తాగునీరు రావడం లేదు. గ్రామంలో పదేండ్లకు ముందు నేను సర్పంచ్‌గా పనిచేశాను. ఆ సమయంలోనే చిట్కుల్‌లో 4వేల ఇండ్లున్నాయి. ఇప్పుడు దాదాపు 6వేల ఇండ్లున్నాయి. 25వేల జనాభా గ్రామ పరిధిలో ఉంది. మిషన్ భగీరథ సర్వేలో 3500 ఇండ్లు ఉన్నాయని పంచాయితీ రిపోర్టు ఇస్తే గ్రామానికి వచ్చే నీరు సరిపోవు. గ్రామంలో చాలా కాలనీల్లో సర్వే నిర్వహించలేదు. ప్రతి ఇంటినీ లెక్కించి నీటిని ఇవ్వాలి. గ్రామంలో నూతనంగా ఇప్పుడు వేయి ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి. 30వేల జనాభా అంచనాతో నీటి వనరులు సమకూర్చుకోవాలి. ముత్తంగి చర్చి ముందు నుంచి గ్రామానికి పైప్‌లైన్ ద్వారా నీరందుతున్నది. దీని వల్ల గ్రావిటీ విఫలమవుతున్నది. మిషన్ భగీరథ అధికారులు పంకజ్ హోటల్ వద్ద నుంచి పైప్ లైన్ వేస్తేనే గ్రావిటీ ద్వారా నీరివ్వవచ్చు.

-ఎస్.రవీందర్, మాజీ సర్పంచ్ చిట్కుల్ గ్రామం

### కాలుష్య గ్రామాలకు నీరివ్వాలి..



కాలుష్య గ్రామాలను ఉచితంగా నీరివ్వాలని గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించింది. ఆ ఆదేశాలను అధికారులు అమలు చేయాలి. చెరువులు, జలవనరులన్నీ కలుషితమైన పటాన్‌చెరు ప్రాంతంలో తాగునీరు లభించకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇటీవల చిట్కుల్ చెరువులో భారీగా చేపలు చనిపోవడం కాలుష్య తీవ్రతను తెలియజేస్తున్నది. అందరికీ సురక్షిత తాగునీరివ్వడం ప్రభుత్వం బాధ్యత. ప్రభుత్వం తక్ష ణం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి.

-శిల్ప, పర్యావరణవేత్త

### 2011 జనాభా లెక్కలతో పేచీ..

పారిశ్రామిక కాలుష్యంతో సతమతమవుతున్న గ్రామాలు హైదరాబాద్ శివారులో ఉండడంతో రోజురోజుకు జనంతో నిండిపోతున్నాయి. పదేండ్ల కాలంలో మేజర్ పంచాయతీల జనాభా రెండు నుంచి మూడు రెట్లు పెరిగింది. ఔటర్ రింగ్‌రోడ్డు ఏర్పాటుతో ఐటీ, ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు రింగ్‌రోడ్డుకు దగ్గరున్న పంచాయతీల్లో వెలుస్తున్న కాలనీల్లో, అపార్టుమెంట్లలో నివసిస్తున్నారు. పంచాయతీలు తాగునీటి వాటా పెంచాలని కోరినా, మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు 2011 జనాభా లెక్కల ప్రకారమే ఇస్తామని పట్టుబడుతున్నారు. 2021లో ఇక్కడ జనగణన జరగకపోవడం శాపంగా మారింది. గ్రీన్ ట్రిబ్యునల్ కాలుష్య పీడిత గ్రామాలుగా గుర్తించిన గ్రామాలను పరిశీలిస్తే 2011లో 8276 జనాభా కల్గిన ఇస్నాపూర్‌లో ఇప్పుడు 35వేల జనాభా నివసిస్తున్నది. ముత్తంగి గ్రామంలో 3601 ఉండగా, దత్తాత్రేయనగర్‌లో 5176 జనాభా ఉండేది. ఇప్పుడు ముత్తంగిలో 30వేల జనా భా వరకు ఉంది. చిట్కుల్‌లో అప్పుడు 5,549 జనాభాగా గుర్తిస్తే.. ఇప్పుడు 25వేల వరకు జనాభా పెరిగింది. ఇంద్రేశం, పాటి, నందిగామ, భానూర్, పెద్ద కంజర్ల, రుద్రారం, పోచారం, అమీన్‌పూర్ మండలంలో కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడ, సుల్తాన్‌పూర్, దాయర గ్రామాల్లోను జనాభా పదేండ్లలో రెట్టింపు అయ్యింది. వీటిలో అధిక శాతం కాలుష్య పీడిత గ్రామాలే కావడంతో సమస్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతంలోని భూగర్భ జలాలను బోర్లద్వారా తోడుకుని ప్రజలు వినియోగిస్తున్నారు. ఇవి అత్యంత కలుషితమైనవి, ఆరోగ్యానికి ప్రమాదం కూడా, ఇప్పటికీ పలు పంచాయతీలు ఇవే బోరు నీటిని మిషన్ భగీరథ నీటిలో కలిపి సరఫరా చేస్తున్నాయి. మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో పలు కాలనీలకు వారంలో ఒక్కరోజు మాత్రమే తాగునీరు అందిస్తున్నారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్, జిన్నారం మండలాల్లో గ్రామాల్లో కాలుష్యంతో సతమతమవుతున్న అన్ని ఇండ్లకు తాగునీరు అందజేయాల్సిన బాధ్యత పంచాయతీలు, మిషన్ భగీరథ అధికారులపై ఉంది. ఆ మేరకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, కాలనీవాసులు కోరుతున్నారు.



నర్సాయపల్లిలో బిందెలతో పత్తి మొక్కలకు నీళ్లు పోయిస్తున్న రైతు చల్లా మహేందర్‌రెడ్డి

# బిందెల సేద్యం..

మద్దూరు(ధూళిమిట్ట), జూలై10: సిద్దిపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండలంలో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. తొలకరిలో కురిసిన వర్షాలకు రైతులు వివిధ పంటలను సాగుచేశారు. విత్తనాలు మొలకెత్తి ఎదిగే సమయంలో వరుణుడు ముఖం చాటేశాడు.15 రోజులుగా వర్షాలు లేక పంటలు వాడిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో చల్లా మహేందర్‌రెడ్డి అనే రైతు తనకున్న రెండెకరాల పత్తి పంటను కాపాడుకునేందుకు కూలీల సహాయంతో బిందెలతో పత్తి మొక్కలకు నీళ్లు పోయిస్తున్నాడు.



చిన్న గుండవెల్లి గ్రామంలో సైకిల్ దంతెతో కలుపును తొలిగిస్తున్న రైతు కిష్టయ్య

# వరుణుడి జాడేదీ..

- వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపులు
- సంగారెడ్డి జిల్లాలో 60శాతం సాగైన పంటలు
- విత్తనాలు విత్తుకునేందుకు వారం గడువు
- ఇప్పటికి కురవని భారీ వర్షాలు
- ఆందోళనలో రైతులు
- జిల్లాలో ఈ సీజన్‌లో 7,24,405 లక్షల ఎకరాల్లో సాగు అంచనా



సంగారెడ్డి, జూలై 10(నమస్తే తెలంగాణ) : వానకాలం ప్రారంభమై నెలరోజులు పూర్తయినా రైతులు మొగులుకేసి చూడడం తప్పడం లేదు. ఇప్పటి వరకు భారీ వర్షాలు కురవ పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంగారెడ్డి జిల్లా లో వానకాలం ఆరంభంలో వర్షాలు కురియడంతో రైతులు సంబురపడి పంటల సాగు మొదలుపెట్టారు. ఆ తర్వాత క్రమంగా వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో ఆశించిన స్థాయిలో వానకాలం సాగు సాగడం లేదు. జిల్లా అంతటా ఇప్పటి వరకు 60 శాతం మాత్రమే పంటలు వేశారు. విత్తనాలు విత్తుకునేందుకు మరోవారం రోజులు గడువు ఉంది. ఈనెల 15వరకు విత్తునాలు విత్తుకునేందుకు సమయం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వారం, పది రోజుల్లో భారీ వర్షాలు కురియకపోతే వానకాలం పంటల సాగు గతేడాది కంటే తగ్గే అవకాశాలు ఉన్నాయి. గతేడాది వానకాలంలో సంగారెడ్డి జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకుపైగా పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది 7,24,405 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 4.33 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు. ఇదే పరిస్థితి ఉంటే పంటల సాగు విస్తీర్ణం తగ్గే అవకాశాలు ఉన్నాయి.

### 60 శాతం మాత్రమే పంటల సాగు..

సంగారెడ్డి జిల్లాలో పక్షం రోజులుగా వర్షాల జాడలేదు. అడపాదడపా అక్కడక్కడా చిరుజల్లులు మాత్రమే కురుస్తున్నాయి. దీంతో పంటల సాగుపై ప్రభావం పడుతున్నది. వానకాలం ప్రారంభమైన జూన్ నెల నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 167.8 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండ గా.. 148.8 వర్షం కురిసింది. జిల్లాలో కేవలం 60శాతం పంటలు మాత్రమే వేశారు. పత్తి, పెసర,మినుము, కంది పంటలు ఆశించిన మేర వేయలేదు. వర్షాలు కురియక పోతే పత్తి, కంది, వరి పంటల సాగు విస్తీర్ణం తగ్గే అవకాశాలు ఉన్నాయి. 4 లక్షల ఎకరాలకుపైగా పత్తి సాగవుతుందని ఆశించగా, ఇప్పటి వరకు 3 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు అయ్యింది. 43వేల ఎకరాల్లో కంది, 7146 ఎకరాల్లో పెసర, 4512 ఎకరాల్లో మినుము, 41,813 ఎకరాల్లో సోయాబీన్, 3602 ఎకరాల్లో మొక్కజొన్న, 7615 ఎకరాల్లో చెరుకు పంటలు రైతులు వేశారు. వరి సాగు కోసం రైతులు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. త్వరలో వరినాట్లు ప్రారంభం కానున్నాయి. రాబోయే వారం రోజులు కీలకం కానున్నది. ఆ సమయంలో భారీ వర్షాలు కురిస్తే పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో గడ్డుకాలం తప్పదు.

# త్వరగా పోస్టింగ్ ఇవ్వాలి

సిద్దిపేట, జూలై 10: ప్రభుత్వం గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు త్వరగా వెబ్ ఆప్షన్లు పెట్టి పోస్టింగ్ ఇవ్వాలి. రెండేండ్ల నుంచి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం నిర్వహించిన గురుకుల ఉపాధ్యాయుల పరీక్షలో ఎంజేపీ గురుకులంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా, సాంఘిక సంక్షేమ గురుకులంలో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా సెలెక్ట్ అయ్యాను. 2022లో అప్పటి ప్రభుత్వం గురుకుల ఉపాధ్యాయుల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. తర్వాత 2023 ఆగస్టులో పరీక్షలు నిర్వహించి, 2024 మార్చిలో ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకాన్ని పూర్తి చేసి హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాన్ని అందించారు. రెండేండ్లుగా పార్ట్ టైం ఉద్యోగిగా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న.. ఉద్యోగం వచ్చిందని సంతోషమే తప్ప ఇప్పటివరకు ఉద్యోగంలో జాయిన్ కాలేదు. ప్రభుత్వం తొందరగా వెబ్ ఆప్షన్ పెట్టి పోస్టింగ్ ఇస్తే ఉద్యోగంలో జాయిన్ అవుతాం. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ కూడా పూర్తయింది. అంతకుముందు హైదరాబాద్ నారాయణ పాఠశాలలో ఉద్యోగం చేస్తుండే వాన్ని, ఉద్యోగం వచ్చిన తర్వాత వారు ఉద్యోగం నుంచి తీసివేశారు. ప్రభుత్వం త్వరిత గతిన పోస్టింగ్ ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

- పరశురాములు, సిద్దిపేట

### ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి

ప్రభుత్వం నిర్వహించిన గురుకుల ఉపాధ్యాయుల పరీక్షలో ఉపాధ్యాయులుగా సెలెక్ట్ అయ్యా, ప్రభుత్వం మార్చిలో నియామక పత్రాన్ని అందజేసింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తయింది. దాదాపు నాలుగు నెలల నుంచి ఇంటి వద్ద ఖాళీగా ఉన్నాం. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం వెంటనే మాకు పోస్టింగ్ ఇచ్చి ఆదుకోవాలి. త్వరగా వెబ్ ఆప్షన్ పూర్తి చేసి పోస్టింగ్ ఇస్తే జాయిన్ అవుతాం. ఎక్కడ పోస్టింగ్ వస్తుందో తెలియక, మా పిల్లలను స్కూల్‌లో జాయిన్ చేయలేదు. ప్రభుత్వం దయచేసి మమ్మల్ని ఆదుకొని వెంటనే పోస్టింగ్ ఇవ్వాలి.

- వెంకట్ రెడ్డి, సిద్దిపేట

### గురుకులానికి ఎంపికైనా ఖాళీగా..



మనూరు, జూలై 10: గురుకులానికి ఎంపికైనా ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఇంతకు ముందు ప్రైవేటు పాఠశాలలో పని చేసిన కొంత ఆదాయం వచ్చేది. ఐదు నెలల నుంచి ఖాళీగా ఉన్నా, గురుకులానికి ఎంపికైనప్పటి నుంచి ఏ పాఠశాలలో తీసుకోవడం లేదు. గురుకులానికి ఎంపికైన వారంతా మధ్యలో వెళ్లిపోతారని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తీసుకోవడం లేదు. మార్చి 4వ తేదీన హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో నాకు ధృవపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి మాకు పోస్టింగ్‌లు ఇప్పించాలి.

- అశోక్, బోరంచ, మనూరు మండలం

# నిధులు రాక నిలిచిన పనులు

- సిద్దిపేటలో నిలిచిపోయిన శిల్పారామం పనులు
- నిధుల విడుదల జాప్యంతో పనులు ఆపిన కాంట్రాక్టర్
- అభివృద్ధి పనులపై ప్రభుత్వం శీతకన్ను
- ప్రభుత్వ తీరును విమర్శిస్తున్న పట్టణవాసులు

సిద్దిపేట, జూలై 10 : ఒకప్పుడు అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచిన సిద్దిపేటలో నేడు అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో అభివృద్ధి కుంటుపడుతున్నది. సిద్దిపేటలో అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ హయాంలో విడుదల చేసిన నిధులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆపివేయడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ సర్కారు సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధిపై శీతకన్ను వేయడంతో నిధులు విడుదల కాక చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే ఆపివేస్తున్నారు. సిద్దిపేట పట్టణంలో కోమటి చెరువు సమీపంలోని బైపాస్ రోడ్‌లో రూ. 25 కోట్లతో చేపట్టిన శిల్పారామం పనులు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

### బీఆర్ఎస్ ప్రభుత్వం రూ .25 కోట్లు మంజూరు..

హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ, ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన విధంగా సిద్దిపేటలోనూ శిల్ప కలలకు విలయంగా శిల్పారామం నిర్మించాలనే లక్ష్యంతో ఆనాటి ఆర్థిక శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రూ. 25 కోట్లు మంజూరు చేయించారు. శిల్పారామాన్ని నిర్మించడం ద్వారా కోమటి చెరువును గొప్ప పర్యాటక ప్రాంతంగా మార్చాలనే ఉద్దేశంతో 2023 ఏప్రిల్ 23న ఈ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు 1500 మంది కూర్చునేలా ఆడిటోరియంతో పాటు ఫుడ్‌కోర్టు, ఫుడ్ స్టాల్, ఎలిఫెంట్ యా టవర్, గజబౌల్స్, కాంపౌండ్ వాల్, ఆర్టిఫిషియల్ బీచ్‌తో పాటు మొత్తం 21 రకాల సౌకర్యాలతో ఈ నిర్మాణం చేపట్టేలా పనులు ప్రారంభించారు.

### బిల్లులు రాక ఆగిన పనులు

తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్మిస్తున్న శిల్పారామం పనులకు నిధులు విడుదల శాపంగా మారింది. దీంతో పనులన్నీ బేస్‌మెంట్ లేలెవలోనే ఆగిపోయాయి. టూరిజం శాఖ అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం ఇప్పటి వరకు రూ .9 కోట్ల మేరకు పనులు జరిగాయని, బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్మాణ పనులను మధ్యలోనే ఆపివేశారు. దీంతో అక్కడికి వెళ్తే మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటి వరకు జరిగిన పనుల్లో రూ.7.8 కోట్ల బిల్లుల విడుదలకు ప్రభుత్వానికి పంపగా, ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. మరో రూ. 2కోట్ల విలువగల పనులకు సంబంధించిన బిల్లులు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సిద్దిపేట అభివృద్ధి అడ్డుకోవడం తగదని, వెంటనే నిధులు విడుదల చేసి పనులు పూర్తిచేయాలని ప్రజల కోరుతున్నారు.



సిద్దిపేటలో బేస్‌మెంట్ లెవెల్‌లో నిలిచిపోయిన శిల్పారామం పనులు

# పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

వీడియోకాన్ఫరెన్స్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



వీసీలో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి, సీడీపీవోలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 10: లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ లబ్ధిదారులకు పౌష్టికాహారం, నాణ్యమైన కోడి గుడ్లు, పాలు, బియ్యం, పప్పు, నూనె, బాలామృతం, మురుకులు అందేవిధంగా పర్యవేక్షించాలని మహిళా, శిశు సంక్షేమ అధికారులను ఆదేశించారు. ఎవరైనా నాణ్యత లేని సరుకులు సరఫరా చేసినట్లు గుర్తిస్తే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. పూర్వ ప్రాథమిక విద్య మీద దృష్టి సారించి, నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అంగన్‌వాడీ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, చిన్నారులకు ఎలాంటి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 15 నుంచి వారం రోజులపాటు 'అమ్మ మాట- అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించి అంగన్‌వాడీ సెంటర్‌లో లబ్ధిదారుల నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కమిషనర్ వాకాటి కరుణ, డైరెక్టర్ క్రాంతి వెస్లీ, జేడీ, ఆర్జేడీ, జిల్లా నుంచి మహిళా, శిశు సంక్షేమ అధికారి లలితాకుమారి, సీడీపీవోలు పాల్గొన్నారు.

### 24 మంది ఎస్సైల బదిలీ

సంగారెడ్డి జూలై 10 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో పని చేస్తున్న 24 మంది ఎస్సైలు బదిలీ అయ్యారు. ఎస్పీ రూపేశ్ 24 మంది ఎస్ఐలకు స్థానచలనం కల్పిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐలు కొత్త స్థానాల్లో వెంటనే చేరాలని ఎస్పీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# మెదక్ ఎస్పీగా ఉదయ్‌కుమార్ రెడ్డి



మెదక్ అర్బన్, జూలై 10: మెదక్ ఎస్పీగా ఉదయ్‌కుమార్ రెడ్డి బదిలీపై రానున్నారు. ఆయన హైదరాబాద్ వెస్ట్ జోన్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మెదక్‌లో ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న బాలస్వామి హైదరాబాద్ ఈస్ట్ జోన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్లనున్నారు. బాలస్వామి 6, జనవరి 2024న మెదక్ ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. ఆయన బాధ్యతలు తీసుకున్న ఆరు నెలల్లో మెదక్ అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా విజయవంతంగా నిర్వహించారు. జూన్ లో మెదక్ పట్టణంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలో భాగంగా మెదక్ పట్టణంతోపాటు జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలుగకుండా, ఎక్కడ అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. మెదక్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఆయన నిరంతరం శ్రమించారు. మెదక్ ఎస్పీగా ఉదయ్‌కుమార్ రెడ్డి త్వరలో బాధ్యతలు తీసుకోనున్నారు.